

మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలెన్నడో? - 8లో▸
కేయూ పరిధిలో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు.



ఆపరేటర్ పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు
ఆపరేటర్ పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.1° /26.2°

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

ములుగు రూరల్ : గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్‌లో సీట్ల భర్తీకి రేపు (గురువారం) స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీసీఓ, జాకారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. జిల్లా పరిధిలోని జాకారం (బాలుర), ములుగు (బాలికల), మల్లంపల్లి (బాలుర) గురుకుల పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలకు నేరుగా జాకారం పాఠశాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆగస్టు 5న సీపీఐ జిల్లా మహాసభ




ములుగు రూరల్: ఆగస్టు 5న జిల్లాకేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. మంగళవారం మల్లంపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల ఐలయ్య, శ్యామ్ సుందర్, రవి, రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్ : ఏటూరునాగారం డివిజన్ పరిధిలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్(బీటీఎం) పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసి, ఇతర శాఖలో రెండేళ్లు విధులు నిర్వహించిన ధ్రువీకరణ పత్రం లేదా బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన అభ్యర్థులు ఇతర శాఖల్లో ఐదేళ్లు విధులు నిర్వహించిన సామర్థ్యం కలిగిన ధ్రువీకరణ పత్రాలను జతపరచాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 4వ తేదీన జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. స్థానికులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

సీఎస్‌సీ హెల్త్ కేర్‌లో ఉద్యోగాలకు..
జిల్లాలోని సీఎస్‌సీ హెల్త్ కేర్ కార్యాలయాల్లో ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి తుల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ సెంటర్‌లో ప్లెబోటమిస్ట్, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు అర్హత పత్రాలు, ఆధార్ కార్డుతో ఆగస్టు 2వ తేదీ ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను కలిసిన డీఎంహెచ్‌ఓ




ములుగు రూరల్ : మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలతను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ ఎడ్యుకేషన్, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని సూచించారు. కీటక జనిత నియంత్రణ జిల్లా అధికారి చంద్రకాంత్ ఉన్నారు.

బస్సునుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలు

భూపాలపల్లి అర్బన్ : ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మంజూర్‌నగర్‌లోని వెయ్యి క్వార్టర్స్ కాలనీకి చెందిన కంగూరి కవిత పని నిమిత్తం హనుమకొండకు వెళ్లి పరకాల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో భూపాలపల్లికి వస్తుంది. ఈ క్రమంలో మంజూర్‌నగర్‌లో దిగేందుకు ప్రయత్నిస్తుండగా బస్సులో నుంచి జారిపడింది. దీంతో కవితకు తల, నడుము భాగంలో తీవ్రమైన గాయాలయ్యాయి. ఘటనా స్థలం నుంచి 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకు వెళ్లారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ



ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.617.21 కోట్లు

- 589 కిమీ 49 హ్యామ్ రోడ్ల ఉన్నతీకరణకు నిధులు
- హనుమకొండ, భూపాలపల్లి సర్కిళ్ల పర్యవేక్షణ
- పల్లెల నుంచి పట్టణాలకు మెరుగవనున్న కనెక్టివిటీ
- హైదరాబాద్‌ను కలిపే జిల్లా, మండల కేంద్రం రోడ్లకు నిధులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్లతో ఉమ్మడి వరంగల్‌కు కొత్త కళ రానుంది. హ్యామ్ మొదటి దశలో తెలంగాణ వ్యాప్తంగా 17 ప్యాకేజీల వారీగా మొత్తం 373 రోడ్ల పనులకు ప్రభుత్వం రూ.6,478.33 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, భూపాలపల్లి సర్కిళ్లకు 588.65 కిలోమీటర్ల రోడ్ల కోసం రూ.617.21 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 49 రోడ్లకు మహర్దశ పట్టనుండగా.. 588.65 కిలోమీటర్ల మేర హ్యామ్ విధానంలో రోడ్లను ఉన్నతీకరించనున్నారు.

'హ్యామ్' విధానం ఇలా..
రోడ్లు ఎక్కడెక్కడంటే..
హ్యామ్ విధానంలో మేజర్ రోడ్లయితే 60 శాతం నిధులను ఉమ్మడి జిల్లాలో టెండర్ల ద్వారా పనులు పొందిన గుత్తేదారు సంస్థలే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ సొమ్మును వాయిదాల పద్ధతిలో చెల్లిస్తుంది. మిగిలిన 40 శాతం నిధులు కూడా దశలవారీగా విడుదల చేసే అవకాశం ఉంది. పెద్దగా ఆర్థిక భారం లేకుండానే రోడ్లను అభివృద్ధి చేసేందుకే ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సర్కిళ్ల పరిధిలో 49 పనులకు రూ.617.21 కోట్లు కేటాయించగా.. గ్రామీణ ప్రధాన రహదారుల ఉన్నతీకరణతో పాటు పల్లెల నుంచి మండల కేంద్రం, జిల్లా కేంద్రాలకు కనెక్టివిటీ ఉన్న రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇదిలా ఉండగా 49 రోడ్లలో ప్రధానంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని హైదరాబాద్ నుంచి హనుమకొండ రోడ్డు (ఓల్డ్ ఎన్‌హెచ్-163) (జీడబ్ల్యూఎంసీ పరిధి)ను 14 కిమీ మేర అభివృద్ధి చేసి, విస్తరించనున్నారు. కాజీపేట నుంచి పెద్దమ్మగడ్డ రోడ్డు (కాజీపేట, ఫాతిమానగర్, వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ, పెద్దమ్మగడ్డ) 9.47 కిమీ రోడ్డుకు సుమారు రూ.20 కోట్లకు పైగా మంజూరు చేశారు. ఆత్మకూరు నుంచి పరకాల వయా శాయంపేట, పెద్దకోడెపాక వరకు ఒకటి 3 కిమీ, మరోటి 11 కిమీ కలిపి మొత్తం 14 కిమీ ఉన్నతీకరించనున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో వర్ధన్నపేట టు కక్కిరాలపల్లి (వర్ధన్నపేట, నందనం, రాంనగర్, కక్కిరాలపల్లి) వరకు 14.50 కిమీ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మడికొండ నుంచి నారాయణగిరి (ఎలుకుర్తి, ముప్పారం, నారాయణగిరి) రోడ్డు 10.50 కిమీ మేర బలోపేతం చేసేందుకు నిధులు కేటాయించారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో కేసముద్రం-నెల్లికుదురు రోడ్డు (కేసముద్రం, భూక్యారాం తండా, మహమూద్‌పట్నం, ఇనుగుర్తి, చిన్న నాగారం, తారాసింగ్‌బాయి తండా, భూక్యా దణ్యతండా, సపావత్ తండా, భోజ్యతండాను కలిపే)ను 20.60 కిమీ మేర అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఇలా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మొదటి విడతలో మొత్తం 49 రోడ్ల కోసం రూ.617.21 కోట్లు ఖర్చు చేయనుండగా.. ఈ నిధులతో మండలం, జిల్లా కేంద్రాలను కలిపే పల్లెరోడ్లు కళకళలాడనున్నాయి.

సర్కిళ్ల వారీగా పనులు, నిధులు, పర్యవేక్షణ..

రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు ఒక వరుస రోడ్లను రెండు వరుసలుగా విస్తరించేందుకు కూడా నిధులు మంజూరు చేశారు. అయితే కొత్తగా ఏర్పడిన సర్కిళ్ల వారీగానే టెండర్లు, పనుల పర్యవేక్షణ జరుగుతోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో హనుమకొండ, భూపాలపల్లి సర్కిళ్లు ఉండగా.. హనుమకొండకు 394.42 కిమీ మేర 39 రోడ్ల ఉన్నతీకరణ కోసం రూ.467.90 కోట్లు కేటాయించారు. భూపాలపల్లి సర్కిల్ పరిధిలో 10 రోడ్లను 194.23 కిమీ మేర అభివృద్ధి, విస్తరణ కోసం రూ.249.31 కోట్లు విడుదల చేశారు. హ్యామ్ రోడ్లపై ఏర్పాటు చేసిన కన్సల్టెన్సీ సంస్థ సూచన మేరకు ఆర్‌అండ్‌బీ సర్కిల్ వారీగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వుల జారీ చేసింది. హ్యామ్ రోడ్ల నిర్మాణానికి నేషనల్ హైవేలకు సంబంధించిన నిబంధనలే వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఆ రోడ్లకు ఖర్చు చేసిన నిధులను కాంట్రాక్టు సంస్థలు టోల్‌ప్లాజా ద్వారా వసూలు చేసుకునే వెసులుబాటు ఉండగా.. ఇక్కడ చేపట్టే హ్యామ్ రోడ్లకు మాత్రం టోల్‌ట్యాక్స్ అనేది ఉండదు. ఆ రోడ్ల నిర్వహణ బాధ్యతను కూడా సదరు గుత్తేదారు సంస్థే అగ్రిమెంట్ ప్రకారం చూసుకోవాల్సి ఉంటుందని సూచించారు.



బొగత జలపాతం వద్ద పర్యాటకులు

పర్యాటకుల సందడి

వాజేడు : మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత జలపాతానికి మంగళవారం పర్యాటకులు తరలివచ్చారు. విస్తారంగా వర్షాలు కురువడంతో బొగత జలపాతం ఉధృతంగా ప్రవహించింది. ప్రవాహ తీవ్రత తగ్గడంతో పర్యాటకులను మంగళవారం నుంచి కొన్ని నిబంధనలతో అనుమతించారు. పర్యాటకుల వాహనాలను తనిఖీ చేసిన తరువాతనే సిబ్బంది లోపలికి పంపిస్తున్నారు.

కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేయాలి

ఎస్పీ డాక్టర్ శబరీష్

ములుగు రూరల్ : దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదుదారుల కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, అనుమానితుల గురించి ఆరా తీస్తూ మానిటరింగ్ చేయాలని తెలిపారు. కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులపై ఆరా తీసి ప్రతి కేసులో సాక్షులకు, ముద్దాయిలకు కోర్టు సమన్లు అందించాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్షపడే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలను పోలీస్ స్టేషన్ల వారిగా అడిగి తెలుసుకున్నారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వెల్లడించారు. మహిళలపై జరిగే నేరాల్లో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్‌కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సీఐలు శ్రీనివాస్, రమేశ్, దయాకర్, ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శబరీష్

స్వచ్ఛతపై కేంద్ర బృందం సర్వే



అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కేంద్రబృందం

ఏటూరునాగారం : మండలంలోని కోయగూడ ఎల్లాపురం గ్రామపంచాయతీలో గల ప్రభుత్వ కార్యాలయాలను స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సెంట్రల్ టీం మంగళవారం తనిఖీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఆలయాలు, ఆస్పత్రులను బృందం సభ్యులు పరిశీలించారు. తడి,పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలు, ఇంకుడు గుంతలను పరిశీలించి మండల పంచాయతీ అధికారి కుమార్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, గ్రామ పంచాయతీ సంయుక్తంగా పనులు చేసి స్వచ్ఛత ఉండే విధంగా చూడాలని సభ్యులు పేర్కొన్నారు. ఈ తనిఖీలో కేంద్ర బృందం ఆర్‌ఐలు రాజు, రేవంత్, ఎస్‌బీఎం జిల్లా అధికారి మైమునిషా, ఐఈసీ షర్ఫునిషా, ఏపీఓ చరణ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎఫ్ఏ ముకుందరావు, కారోబార్ పాల్గొన్నారు.

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.9లక్షలు



కల్యాణ మండపంలో కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు

మంగపేట : మండలంలోని హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.9.18లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రావణం సత్యనారాయణ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ పరకాల డివిజన్ పరిశీలకులు నందనం కవిత పర్యవేక్షణలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు కానుకలను లెక్కించారు. ఆరు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని భక్తులు హుండీల్లో స్వామివారికి సమర్పించారు. అర్చకులు శేఖర్‌శర్మ, పరిచారిక ఈశ్వర్‌చంద్, సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, సిబ్బంది శేషు, లక్ష్మీనారాయణ, అజయ్, నవీన్, గణేష్, హైదరాబాద్, ఏటూరునాగారం, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరుకు చెందిన శ్రీవారి సేవాబృందం భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తాం..


ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాఘవరెడ్డి



వాగును పరిశీలిస్తున్న ఎస్‌ఈ రాఘవరెడ్డి

వెంకటాపురం(కె) : మండలకేంద్రం నుంచి ఎదిర గ్రామపంచాయతీ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తామని ఆశాఖ ఎస్‌ఈ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో ఆయన పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వీరభద్రవరం, బోదాపురం వంతెనలను పరిశీలించామని చెప్పారు. కుక్కతోగు వంతెనను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. 40ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలను తనిఖీ చేస్తామని, ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారిందని మరమ్మతుల కోసం రూ.2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు ఎస్‌ఈని కలిసి మండలంలో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఈఈ సాంసింగ్, డీఈ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఎస్సైగా శ్రీకాంత్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డికి ప్రశంసపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఎస్ఎస్‌తాడ్వాయి : తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఎస్సైగా నిలిచి ఎస్పీ డాక్టర్ శబరీశ్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి ప్రశంసపత్రం అందజేశారు. కేసుల విచారణ, అక్రమ పశువుల రవాణా, గుడుంబా కేసుల నమోదు, ఓవర్ లోడ్ లారీపై కేసులు, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ ఉల్లంఘన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాలను నివారణ, గంజాయి నివారణ కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో జిల్లా ఉత్తమ ఎస్సైగా మూడో సారి ప్రశంసపత్రం అందుకున్నారు. ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్‌లకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

కలెక్టర్ టీఎస్ దివాకర



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్ : అట్రాసిటి కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించాలని కలెక్టర్ టీఎస్ దివాకర పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అట్రాసిటి కేసుల నమోదు, పురోగతి, బాధితులకు పరిహారం అందే విధంగా అధికారులు కృషిచేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శిస్తున్నామని, మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన బోరుబావులను అర్హులైన లబ్ధిదారులకు అందించామని వెల్లడించారు. అలాగే మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. అనంతరం డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. అట్రాసిటి కేసుల విషయంలో త్వరగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్ పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులను వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీఓ వెంకటేశ్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి, రాంబాబు, నరేందర్, కృష్ణ, రామునాయక్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్..
దేశ భవిష్యత్ యువత, విద్యార్థులపైనే ఉందని కలెక్టర్ దివాకర అన్నారు. మండలంలోని బండారుపల్లి మోడల్ స్కూల్ పీఎంశ్రీ పథకంలో ఉత్తమ పాఠశాల ఎంపిక కావడంతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని కోరారు. పీఎంశ్రీ నిధులను పాఠశాల అవసరాల నిమిత్తం ఖర్చు చేసి జిల్లాలో ఉత్తమ పాఠశాలగా నిలిపినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ దేవకి, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఇందులో భాగంగా పాఠశాలకు మంజూరైన సంగీత పరికరాలను విద్యార్థులకు అందించారు. మండల విద్యాశాఖ అధికారి తిరుపతి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు అర్షం రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు
వెంకటాపురం(ఎం) : ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దివాకర హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, కొనుగోలు, అమ్మకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు సరిపడ అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు.అనంతరం మండల కేంద్రంలోని, పాలంపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రామప్ప సరస్సును పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో ఏఓ శైలజ, ఎంఈఓ ప్రభాకర్, ఇరిగేషన్ డీఈ రవీందర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వెంకటాపూరం(ఎం): పాలంపేట పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్

తనిఖీలు లేవు..!

- హోటల్ యజమానుల ఇష్టారాజ్యం
- గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఇన్‌చార్జ్‌లే..

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బిర్యానీ పాయింట్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యతను పట్టించుకోవాల్సిన అధికారులు తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యం నడుస్తోంది. పదుల సంఖ్యలో అనుమతులు ఉండగా వందల సంఖ్యలో హోటల్, రెస్టారెంట్లు నడుస్తున్నాయి. నాణ్యత పాటించకపోవడంతో ఏమైనా తినాలంటే ప్రజలు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

సిబ్బంది లేమితో సతమతం
జిల్లాలో హోటళ్లు, ఇతర దుకాణాలలో పర్యవేక్షణ కరువైంది. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అండ్ ఫుడ్ సెఫ్టీ డిగ్జినేటెడ్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఈ కార్యాలయంలో గెజిటెడ్ ఆఫీసర్, ఇద్దరు ఫుడ్ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఇద్దరు అటెండర్లు ఉండాలి. కానీ జిల్లా వ్యాప్తంగా ఒక్క ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేరు. కలెక్టరేట్‌లో కార్యాలయం ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. జిల్లా వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రోగ్రాం అధికారికి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్‌గా ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రెండేళ్లుగా ఒక్క కేసు కూడా లేదు..
జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతుంది. మూడు నాలుగేళ్ల క్రితం వరకు 10లోపు కేసులను నమోదు చేశారు. రెండు సంవత్సరాల నుంచి జిల్లాలో ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో యథేచ్ఛగా కల్తీ చేసిన వస్తువులను విక్రయాలు చేపడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తినుబండరాలు అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతి పదుల్లో..
జిల్లాలో సుమారు 500 వరకు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, 10 వరకు రెస్టారెంట్లు, 5 వరకు దాబాలు ఉన్నాయి. భూపాలపల్లి, కాటారం, గణపురం, టేకుమట్ల, చిట్యాల, కాళేశ్వరం వంటి ప్రాంతాలతో పాటు ప్రతీ మండల కేంద్రంలో హోటళ్లు, బేకరీలు, మెస్‌లు మొదలైనవి వందల సంఖ్యలో నడుస్తున్నాయి. జిల్లా ఏర్పడిన నాటి నుంచి జిల్లా కేంద్రంలో కొన్ని తప్ప ఇతర ప్రాంతాల్లో నడిచే షాపులకు ఎటువంటి అనుమతులు పొందకుండా యథేచ్ఛగా నడిపిస్తున్నారు.



పై ఫొటోలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్. ప్రధాన రహదారిపై నిబంధనలు పాటించకుండా హోటల్‌లో అపరిశుభ్ర వాతావరణంలో తినుబండరాలు తయారు చేస్తున్నారు. ఈగలు వచ్చి తయారు చేసిన ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. వాహనాల దుమ్ము ధూళి సైతం నూనెలో పడుతుంది. అపరిశుభ్ర వాతావరణమే కాకుండా రెండు మూడు రోజుల పాటు వినియోగించిన నూనెలోనే పదార్థాలను తయారు చేస్తున్నారు. నూనె పూర్తిగా నల్ల రంగుగా మారి అనారోగ్యాలకు దారితీస్తుంది. ఇక్కడ ఒక దగ్గరే కాదు.. ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉంది.

డిగ్రీ ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో నూతన పాఠ్యపుస్తకం


సమావేశంలో బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ఈ విద్యాసంవత్సరం (2025–2026)నుంచి నూతన పాఠ్యపుస్తకం తీసుకురానున్నట్లు ఆ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ పి.నిర్మల తెలిపారు. మొదటి సంవత్సరంలో ఇంగ్లిష్ ఫర్ బ్రిలియన్స్ పాఠ్య పుస్తకం ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం కేయూలోని ఇంగ్లిష్ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కొత్త సిలబస్‌లో గద్యభాగం, కవిత్వం, నటన, నాటకం, వ్యాకరణం, లెర్నింగ్ స్టడీ, రీడింగ్, రైటింగ్ నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు ఉంటాయని వివరించారు. ఈ నూతన పాఠ్యపుస్తకాలు వారం రోజుల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆ విభాగం అధిపతి డాక్టర్ ఆర్. మేఘనరావు, బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులు ఎం.నవీన్, శ్రీనాథ్, రాంభాస్కరరాజు, హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ ఫారిన్‌లాంగ్వేజెస్ యూనివర్సిటీకి చెందిన ఎక్స్‌టర్నల్ మెంబర్ ప్రొఫెసర్ శారద పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్‌లో రీమోడలింగ్ పనుల నేపథ్యంలో కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..
ఆగస్టు 30వ తేదీన చర్లపల్లి–రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 31న రక్సోల్–హైదరాబాద్ (17006) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 1వ తేదీన చర్లపల్లి–రక్సోల్ (07005) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 2వ తేదీన రక్సోల్–చర్లపల్లి (07052), సెప్టెంబర్ 4వ తేదీన రక్సోల్–చర్లపల్లి (07006) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 8వ తేదీన హెచ్.ఎస్.నాందేడ్–సంత్రగచ్చి (12767) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 9వ తేదీన చర్లపల్లి–దర్భాంగా (17007) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 10వ తేదీన సంత్రగచ్చి–హెచ్.ఎస్.నాందేడ్ (12768) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 12వ తేదీన దర్భాంగా–చర్లపల్లి (17008) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్లు రీషెడ్యూల్
కాజీపేట జంక్షన్ మీదుగా ఆగస్టు 30వ తేదీన తాంబరం–జషిధి (12375) ఎక్స్‌ప్రెస్ 6 గంటలు, సెప్టెంబర్ 1,8వ తేదీల్లో శ్రీమాత వైష్ణవి టెంపుల్ బెంగళూరు–టాటానగర్ (12890) ఎక్స్‌ప్రెస్ 5 గంటలు, సెప్టెంబర్ 9వ తేదీన శ్రీ మాతవైష్ణవి టెంపుల్ బెంగళూరు–హతియ (12836) ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్‌తో నడిపించనున్నట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

గార్ల: గార్ల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్‌లపై మంగళవారం పెట్రోలు పోసి దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న మహిళ సెల్‌ఫోన్‌కు, అదే కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ తరచూ మెస్సెజ్‌లు పెడుతున్నాడు. అనుమానం వచ్చిన ఏఎస్‌ఓ భర్త 'నీకు ఎందుకు మెస్సెజ్‌లు పెడుతున్నాడు'అంటూ భార్యను నిలదీశాడు. విషయం ఏఎస్‌ఓ తన తల్లితండ్రులకు సైతం తెలిపింది. ఏఎస్‌ఓ, ఆమె భర్త, తల్లిదండ్రులు కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఏఎస్‌ఓ, జూనియర్ అసిస్టెంట్ మధ్య సంధానకర్తగా వ్యవహరించిన రికార్డ్ అసిస్టెంట్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించబోగా కార్యాలయ సిబ్బంది వచ్చి వారించారు. అంతటితో ఆగకుండా జూనియర్ అసిస్టెంట్‌పై దాడికి పాల్పడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రికార్డ్ అసిస్టెంట్ జ్యోతి తనపై పెట్రోల్ పోసి దాడికి పాల్పడిన ఏఎస్‌ఓ, ఆమె భర్త, తల్లిదండ్రులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలెన్నడో?

- కేయూ పీజీ వివిధ విభాగాల్లో ఇంకా వెల్లడించని రిజల్ట్
- ఎదురుచూస్తున్న విద్యార్థులు
- పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు మరూ..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్,ఎక్స్,ఇంప్రూవ్‌మెంట్)నిర్వహించి నాలుగు నెలలు పూర్తయినా నేటికీ కొన్ని విభాగాల ఫలితాలు విడుదల కావడం లేదు. కొన్ని విభాగాల ఫలితాలను ఇటీవలే విడుదల చేశారు. కాగా, పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నారు. పరీక్షలు నిర్వహించిన 40 రోజుల్లోనే ఫలితాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ మూల్యాంకనంలో జాప్యం చేస్తూనే ఉన్నారు. ఉదాహరణకు ఇంకా ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ తదితర పలు విభాగాల ఫలితాలు వెల్లడించలేదు.

ఆన్‌లైన్‌లోనూ జాప్యమేనా?
కొన్ని సంవత్సరాలుగా కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సుల పరీక్షలు జవాబుపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్‌లోనే కొనసాగుతోంది. అధ్యాపకులు పరీక్షల విభాగానికి రాకుండానే కంప్యూటర్లలో డిపార్ట్‌మెంట్‌లోగాని, ఇంటివద్దగాని మూల్యాంకనం చేసుకునే అవకాశం ఉంది. అయినా సంబంధిత కొందరు అధ్యాపకులు మూల్యాంకనం చేయడంలో జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది. ఆన్‌లైన్‌లోనే జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు కూడా పోస్టు చేస్తారు. విద్యార్థుల జవాబుపత్రాలను తొలుత ఇంటర్నల్‌గా యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో మూల్యాంకనం చేస్తారు. అవే జవాబుపత్రాలను సెకండ్ వాల్యుయేషన్‌కు (ఎక్స్‌టర్నల్‌గా) ఇతర యూనివర్సిటీల అధ్యాపకులకు కూడా ఆన్‌లైన్‌లోనే పంపి మూల్యాంకనం చేయిస్తారు. ఉదాహరణకు ఒక సబ్జెక్టు పేపర్ పరీక్ష జవాబుపత్రంలో మొదటి మూల్యాంకనానికి, రెండో మూల్యాంకనానికి వచ్చిన మార్కుల్లో 16 మార్కుల వరకు తేడావస్తే మళ్లీ ఆయా పేపర్లను థర్డ్ వాల్యుయేషన్‌కు కూడా పంపుతారు. ఆ విధంగా అయితే కొంత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. పరీక్షలు నిర్వహించాక జవాబుపత్రాల వాల్యుయేషన్ ప్రక్రియలో జాప్యానికి పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. కోడింగ్ స్కాన్ చేయించడంలోనూ జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

రెమ్యునరేషన్ చెల్లించడంలో జాప్యం..
వాల్యుయేషన్ రెమ్యునరేషన్ చెల్లించడంలో అధికారులు జాప్యం చేయడంతో అధ్యాపకులు మూల్యాంకనం పట్ల ఆసక్తి కనబర్చడం లేదు.అంతేగాకుండా ఎక్స్‌టర్నల్‌గా ఇతర యూనివర్సిటీల ఆచార్యులకు పంపినప్పుడు వారు కూడా వాల్యుయేషన్ చేయడంలో జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది. ఫలితాలను సకాలంలో వెల్లడించకపోవడంతో విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. కొన్ని విభాగాల విద్యార్థులకు తమ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల కాకున్నా రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫలితం ఎలా ఉందో అనే అంశంపై విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంటోంది. ఈ విషయంపై అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్యను వివరణ కోరగా పలు విభాగాల కోర్సుల ఫలితాలు వచ్చాయని, ఇంకా కొన్ని కోర్సుల ఫలితాలు మూల్యాంకనం పూర్తికావొస్తుందన్నారు. ఈనెలాఖరులోపు మూల్యాంకనం పూర్తిచేయించాలని సంబంధిత అధ్యాపకులను కోరినట్లు తెలిపారు.

రవాణా సేవలు మరింత ప్రియం

- సేవా రుసుముల పెంపుతో వాహనదారుల ఇబ్బందులు
- వాహన బదిలీలు కాకపోవడంతో తప్పని తిప్పలు
- ఇప్పటికే అమల్లోకి వచ్చిన ధరలు



సాక్షి, వరంగల్ : రవాణా సేవలు మరింత ప్రియమయ్యాయి. దీనికి సంబంధించిన జీఓను రవాణా శాఖ ఈ నెల 22న జారీ చేయగా ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ విషయం తెలియక స్లాట్‌బుక్ చేసుకుని సోమవారం, మంగళవారం రెండురోజులు జిల్లా రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్లిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అంతకంటే ముందు స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులు పాత ధరల ప్రకారం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించారు. తీరా ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన తర్వాత పెరిగిన చార్జీలు చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో విస్తుపోయారు. ఈ నెల 27న స్లాట్ బుక్ చేసుకున్న వారు మాత్రం పెరిగిన చార్జీలను ఆన్‌లైన్‌లో చెల్లించారు. అలాగే, వాహనాల బదిలీకి సంబంధించి ఆన్‌లైన్‌లో తీసుకోకపోవడంతో రవాణా శాఖ కార్యాలయాలకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాత వాహనాలకు సంబంధించి ఇన్వాయిస్ ధర ఆర్టీఏ సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ కాకపోవడంతో వాహనాల బదిలీ కాలేదు. కంప్యూటరీకరణకు ముందున్న పాత వాహన ధరలు లేకపోవడంతో వాహనాలు బదిలీ కావడం లేదు. ఇందుకు సంబంధించి సర్వీస్ చార్జీని నిర్ణయించిన తర్వాతే వీటి సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని ఆర్టీఏ అధికారులు తెలిపారు.

సర్వీస్ చార్జీలు ఎంత పెరిగాయంటే..
2017లో దరఖాస్తు రుసుములు పెరగగా, ప్రస్తుతం ఆర్టీఏ సేవలకు సంబంధించిన సర్వీస్ చార్జీలు పెరిగాయి. ఇంతకుముందు ద్విచక్ర వాహన లెర్నింగ్ లైసెన్స్‌కు రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.400, ద్విచక్ర, లైట్ మోటార్ వాహనానికి రూ.450 ఉండగా రూ.550కి పెరిగింది. ద్విచక్ర వాహన డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.1,035 ఉండగా, రూ.1,135, ఫోర్ వీలర్ వాహనం రూ.1,330 నుంచి 1,430కి పెరిగింది. టూ, ఫోర్ వీలర్, ట్రాక్టర్, ట్రాలీ, ఎల్‌ఎల్(లెర్నింగ్)కు రూ.600 నుంచి రూ.700, డ్రైవింగ్ లైసెన్స్‌కు 1,635 నుంచి రూ.1,735కి పెరిగింది. ఇతర లైసెన్స్‌లపై రూ.100 అదనపు సర్వీస్ చార్జీ చేస్తున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్, వాహన బదిలీ, ఇతర సేవలపై అధికంగా భారం పడనుంది. నాన్ ట్రాన్స్‌పోర్ట్ (ద్విచక్ర) వాహన ధర ఇన్వాయిస్‌పై 0.5 శాతం, కార్లు అయితే ఇన్వాయిస్‌పై 0.1 శాతం సర్వీస్ చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వాహన బదిలీకి గతంలో రూ.935 ఉండగా ప్రస్తుతం రూ.1,405 (వాహనాన్ని బట్టి) పెరిగింది. ట్యాక్స్ (త్రైమాసిక పన్ను) రూ.500లోపు అయితే రూ.25 సర్వీస్ చార్జ్ ఉండగా రూ.50కు, రూ.500పైనా అయితే రూ.50 ఉండగా రూ.100కు పెంచారు. ఎన్‌ఓసీకి రూ.100 ఉండగా రూ.690కి పెరిగింది.

ఆపరేటర్ పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు

- ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: కొత్త సబ్ స్టేషన్ల మంజూరుతోపాటు ఆపరేటర్ పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి చెప్పారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్‌ఈఈయూ–327 కార్యాలయం పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–327 ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కోకు చెందిన ఆర్టిజన్ ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సబ్ స్టేషన్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఉద్యోగులు విధిగా భద్రతాప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు సెల్‌ఫోన్ ఇచ్చామని, తద్వారా ఎల్‌సీ యాప్‌ను సులువుగా వినియోగించొచ్చన్నారు. జీరో ప్రమాదాల లక్ష్యంగా విధులు నిర్వర్తించాలన్నారు. అంతకు ముందు టీఎస్‌ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్.. ఆర్టిజన్ల సమస్యలు వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండలం ఏనుగల్‌కు చెందిన అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ అస్లావత్ బాలోజీ విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోగా టీఎస్‌ఈఈయూ–327 ఆధ్వర్యంలో రూ.70 వేల ఆర్థిక సాయాన్ని సీఎండీ వరుణ్ రెడ్డి చేతుల మీదుగా బాలోజీ భార్య లలిత, కుమారులకు అందించారు. సమావేశంలో టీఎస్‌ఈఈయూ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి కొండూరి శ్రీనివాస్, టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి భూపాల్‌రెడ్డి, జెన్‌కో అధ్యక్షుడు మాధవ రావు, నాయకులు తులసి శ్రీమతి, ధరావత్ సికిందర్, గన్ను నరేందర్ రెడ్డి, సతీశ్‌రెడ్డి, వల్లాల యుగంధర్, పప్పు వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, హతీరాం పాల్గొన్నారు.

అన్నయ్యను స్కూల్ బస్సెక్కించడానికి వచ్చి మృత్యుఒడికి..

- అదే బస్సు కిందపడి చెల్లి దుర్మరణం
- అంబట్‌పల్లిలో ఘటన.. గ్రామంలో విషాదఛాయలు


శ్రీహర్షిణి(ఫైల్)

కాళేశ్వరం: తన ముద్దుల అన్నయ్యను స్కూల్ బస్సు ఎక్కించడానికి వచ్చిన చెల్లి మృత్యుఒడికి చేరింది. ఎక్కించిన అనంతరం వెనుదిరుగుతున్న క్రమంలో అదే బస్సు వెనుక టైర్ కిందపడి దుర్మరణం చెందింది. ఈ ఘటన మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారంలోని ఓ ప్రైవేట్ పాఠశాల స్కూల్ బస్సు మంగళవారం విద్యార్థులను తీసుకెళ్లడానికి అంబట్‌పల్లికి వచ్చింది. ఈ క్రమంలో సింగనవేని భాగ్య తన కుమారుడు అన్విత్‌ను బస్సు ఎక్కించడానికి కుమార్తె శ్రీహర్షిణి(3)తో కలిసి వచ్చింది. కుమారుడిని బస్సు ఎక్కించి వెనుదిరుగుతున్న సమయంలో బస్సు ముందుకెళ్లింది. ఆ సమయంలో డ్రైవర్‌కు తల్లి కనిపించగా, చిన్నారి కనిపించలేదు. దీంతో బస్సును ముందుకు కదలించగా చిన్నారి వెనుక టైరు కింద పడింది. బస్సు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తమ గారాలపట్టీ మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. నీకు అప్పుడే నూరేళ్లు నిండాయా బిడ్డా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై తండ్రి సింగమనేని మల్లేశ్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. చిన్నారి శ్రీహర్షిణి మృతి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, బస్సుడ్రైవర్ పరారీలో ఉన్నాడు.

చెరువులో ఎడ్లను శుభ్రంచేస్తుండగా..

- నీటమునిగి వ్యవసాయ కూలీ మృతి
- రంగాపురంలో ఘటన


రాజయ్య(ఫైల్)

నల్లబెల్లి: చెరువులో ఎడ్లను శుభ్రం చేస్తుండగా ఓ వ్యవసాయ కూలీ నీటమునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రంగాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుల రాజయ్య(59) వ్యవసాయ కూలీగా పని చూస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం అదే గ్రామానికి చెందిన అలువాల సంపత్‌కు బురదగొర్రు కొట్టేందుకు అద్దెకు వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం బావని కుంట చెరువులో ఎడ్లను శుభ్రం చేస్తున్నాడు. ఈ క్రమంలో నీటమునిగి మృతి చెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు రాజయ్య ఆచూకీ కోసం గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. దీంతో బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.


రేపటినుంచి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్–2025 పోటీలు ఈ నెల 31వ తేదీనుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ మామునూరు వేదికగా ఉదయం 9గంటలకు ఉన్నతాధికారుల చేతుల మీదుగా పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని ఏడు పోలీస్ జోన్లు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లతోపాటు సీఐడీ, ఇంటెలిజెన్స్, యాంటీనార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ, జీఆర్‌పీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు వేయిమంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నట్లు వివరించారు. సైంటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, మీడియాగ్రఫీలకు సంబంధించిన 25 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 2న తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. దీంతోపాటు చాంపియన్ షిప్ ట్రోఫీ కూడా అందజేయనున్నట్లు సీపీ వెల్లడించారు.

కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్

ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహణ
- ఇప్పటికే 400 వరకు పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్ట్స్
- ఆగస్టు 3 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే సదస్సు ఉద్దేశం



కేయూ క్యాంపస్: విద్యార్థులు, టీచర్లు, యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలనే ఉద్దేశంతో తెలంగాణ అకాడమీ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా కాకతీయ యూనివర్సిటీలో ఆగస్టు 19, 20, 21 తేదీల్లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించబోతున్నారు. కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటై ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీతో 50 సంవత్సరాలు పూర్తికాబోతున్నాయి. దీంతో యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించబోతున్నారు. అందుకు అధికారులు కమిటీలను నియమించి సమావేశం సన్నాహాలు చేస్తున్నారు. ఈ సైన్స్ కాంగ్రెస్ 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' అనే అంశంపై కొనసాగనుంది. అంతేకాకుండా మరో ఏడు థీమ్స్‌లోనూ ప్లీనరీ సెషన్స్ జరగనున్నాయి. ఫిజికల్ అండ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కెమికల్ సైన్సెస్, లైఫ్‌సైన్స్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్, మెడికల్ హెల్త్ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఎర్త్ ఓసియన్ అట్మాస్పియర్,ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌లోనూ ప్లీనరీ సెషన్స్ ఉంటాయి.

ఇప్పటి వరకు 400 వరకు అబ్‌స్ట్రాక్ట్స్..
రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, పరిశోధకులు తదితరులు సైన్స్ కాంగ్రెస్‌లో తమ పరిశోధన పత్రాలు సమర్పించేందుకు 400 వరకు అబ్‌స్ట్రాక్ట్స్ వచ్చాయి. 150 వరకు రిజిస్ట్రేషన్స్ అయ్యాయి.రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉంది.

విద్యార్థులు, టీచర్లతో సైంటిస్టుల ఇంటారాక్షన్
సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులు, టీచర్లతో ప్రముఖ సైంటిస్టుల ఇంటరాక్షన్ కూడా ఉంటుంది. ప్రస్తుతం సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సీహెచ్. మోహన్‌రావు, డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ మార్త్తా ఎస్‌రెడ్డి, వరంగల్ నిట్ రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ ఎస్. ఈశ్వరప్రసాద్‌తో ఇంటారాక్షన్ ఉంటుంది.

ప్లీనరీ సెషన్ –1లో..
తొలిరోజు ప్లీనరీ సెషన్– 1లో హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ కె. నందికూరి, బెంగుళూరులోని డీఆర్‌డీఓ ఎల్‌ఆర్‌డీఈ డైరెక్టర్ జి విశ్వమ్ వివిధ అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. ఇలా మూడు రోజుల పాటు దేశంలోని వివిధ సంస్థల నుంచి అనేక మంది సైంటిస్టులతో ప్లీనరీ సెషన్‌లు ఉంటాయి.

ఆగస్టు 3 వరకు గడువు..



కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరగబోయే తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్‌కు 500 వరకు ప్రతినిధులు వచ్చేఅవకాశం ఉంది. ఆసక్తి గల వారు వివిధ విభాగాలకు సంబంధించిన వారు తమ పరిశోధనపత్రాల సమర్పణకు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు గడువు ఆగస్టు 3 వరకు ఉంది.
–ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి, లోకల్ సెక్రటరీ,తెలంగాణ సైన్స్ కాంగ్రెస్

విద్యార్థుల ఎగ్జిబిట్లకు అవకాశం..
సైన్స్‌లో వివిధ విభాగాల్లో పాఠశాలల విద్యార్థులు కూడా తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ మాదిరి తమ ఎగ్జిబిట్లను తీసుకొస్తే ఏ విభాగానికి సంబంధించినది అయితే ఆ విభాగంలో జరిగే సెషన్లలో ప్రదర్శించే అవకాశం ఉంటుంది. అందుకే హైస్కూల్ స్థాయి విద్యార్థులు కూడా దీనిని వినియోగించుకునేలా సైన్స్ టీచర్లు సహకరించాల్సి ఉంటుంది.

మళ్లీ కేయూలోనే సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ ..
తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ 2018లో వరంగల్ నిట్‌లో నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ రెండో సైన్స్ కాంగ్రెస్ కూడా వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలోనే నిర్వహించబోతున్నారు. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ కమిటీలను కూడా నియమించారు

విద్యార్థులు, టీచర్లకు రిజిస్ట్రేషన్ లేకుండానే పాల్గొనే అవకాశం..
యూనివర్సిటీల కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకే కాకుండా హైస్కూల్ స్థాయి విద్యార్థులు, టీచర్లు కూడా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు సైన్స్ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి. వెంకట్రామ్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సైన్స్ అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చారు. సైన్స్ టీచర్లు.. 9,10వ తరగతుల విద్యార్థులను ఈ సైన్స్ కాంగ్రెస్‌కు తీసుకురావాలని కోరారు.

బ్రోకర్ల బోగస్ దందా..

నకిలీ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాల తయారీ
- 15 మంది అరెస్ట్.. ఐదుగురు పరారీ
- వివరాలు వెల్లడించిన డీసీపీ షేక్ సలీమా


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ షేక్‌సలీమా

హసన్‌పర్తి : రిజిస్ట్రేషన్, లైసెన్స్ కోసం వాహనదారులను లూటీ చేస్తున్న బ్రోకర్లు మరో దందాకు తెరలేపారు. బోగస్ రిజిస్ట్రేషన్‌తోపాటు ఇన్సూరెన్స్ పత్రాలను తయారు చేసి వాటితో వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ చేయిస్తున్న రెండు వేర్వేరు ముఠాలను టాస్క్‌ఫోర్స్, హనుమకొండ, కేయూసీ, మిల్స్ కాలనీ పోలీసులతో పాటు ఆర్‌టీఏ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మంగళవారం విలేకరులకు వెల్లడించారు. హనుమకొండకు చెందిన ఆసిఫ్ ఖురేషి, వడ్లకొండ శ్రీనివాస్, లేబర్‌కాలనీకి చెందిన ఎం.డి.నవాబ్, ఎల్.బీనగర్‌కు చెందిన సాబీర్, నయీంనగర్‌కు చెందిన మణికంఠ ప్రభాకర్‌రెడ్డి, కాపువాడకు చెందిన గుగ్గిళ్ల చెర్రిబాబు, హనుమకొండ గుడిబండల్‌కు చెందిన కేశోజు రాజ్‌కుమార్ అలియాస్ డి.ఎల్.రాజు, ధర్మసాగర్ మండలం కరుణాపురానికి చెందిన ఎం.డి ఆసిఫ్, ధర్మసాగర్‌కు చెందిన అంకం శ్రీనివాస్, హనుమకొండ సుధానగర్‌కు చెందిన గోనెల రమేశ్ అలియాస్ వాగ్దేవి రమేశ్, ఫోర్ట్ వరంగల్‌కు చెందిన ఎన్. శశివర్ధన్, కరీమాబాద్‌కు చెందిన నరిశెట్టి రాజేశ్, గీసుకొండ మండలం శాయంపేట హవేలికి చెందిన దిలీప్‌కుమార్, నక్కలపల్లికి చెందిన ముజ్జిగ ఓంప్రకాశ్, ఫాతిమానగర్‌కు చెందిన ముసిపట్ల అక్షయ్‌కుమార్.. ఆర్‌టీఏ బ్రోకర్లు, కన్సల్టెన్సీలుగా వ్యవహరిస్తున్నారు. సతీశ్, వేల్పుల ప్రశాంత్, దేవులపల్లి శ్రవణ్, మామిడి రాజు అలియాస్ భూపాలపల్లి రాజు, లక్ష్మయ్య పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.

ఫైనాన్స్ సంస్థల నుంచి వాహనాలు కన్సల్టెన్సీలకు..
ఫైనాన్స్‌పై వాహనాలు కొనుగోలు చేసిన వారు ఆర్థిక కారణాలతో వాయిదాల డబ్బులు చెల్లించని పక్షంలో ఆ వాహనాలు ఫైనాన్స్ సంస్థలు స్వాధీనం చేసుకుని తిరిగి వాటిని విక్రయించాలంటే ఆన్‌లైన్‌లో ఆర్‌టీఏకు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఫైనాన్స్ సంస్థలు అలా చేయకుండా వాహన కన్సల్టెన్సీలకు విక్రయించేవి. ఈ సమయంలో వారికి నో అబ్జెక్షన్‌తో సర్టిఫికెట్‌తో పాటు ఒరిజినల్ వాహన రిజిస్ట్రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. అలా కాకుండా ఫైనాన్స్ సంస్థలు నేరుగా కన్సల్టెన్సీలకు వాహనాలు విక్రయించేవి. ఈ క్రమంలో ఫైనాన్స్ నుంచి ఖరీదు చేసిన కన్సల్టెన్సీలు హనుమకొండకు చెందిన ఎం.డి. ఆసిఫ్, వడ్లకొండ శ్రీనివాస్.. ఆర్‌టీఏ బ్రోకర్లను సంప్రదించేవారు.

బోగస్ రిజిస్ట్రేషన్ పత్రాల సృష్టి..
ఆర్‌టీఏ బ్రోకర్లుగా చలామణి అవుతున్న ఆసిఫ్, వడ్లకొండ శ్రీనివాస్ ఫైనాన్స్ సంస్థలు స్వాధీనం చేసుకున్న వాహనాల ఆన్‌లైన్ పత్రాలను సేకరించి, ఆ తర్వాత వివిధ మార్గాల్లో బోగస్ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించే వారు. ఇలా కన్సల్టెన్సీల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిస్తూ వచ్చారు. అనంతరం వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రెన్యువల్ సర్టిఫికెట్లు, వాహనాల బదిలీల కోసం బీమా లేని వాహనదారుల నుంచి ఈ ముఠా పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి బోగస్ బీమా పత్రాలు తయారు చేసి ఆర్‌టీఏ కార్యాలయంలో సమర్పించే వారు.

బోగస్ పత్రాలు తయారీ ఇలా
ఈ ముఠా సభ్యులు ముందు ఒరిజినల్ బీమా పాలసీ పత్రం తీసుకుని అందులో తమకు కావాల్సిన వివరాలు పొందుపరిచే వారు. అలా ఆ పత్రాలను ఆర్‌టీఏ కార్యాలయంలో సమర్పించే వారు. కాగా, ఈ దందాలో ఆర్‌టీఏ కార్యాలయ సిబ్బంది సహకారంపై డీసీపీ అనుమానం వ్యక్తం చేశారు. నిందితుల నుంచి ఆరు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, థర్మల్ ప్రింటర్లు, 17 సెల్‌ఫోన్లు, కంప్యూటర్ చిప్‌తో కూడిన పీవీసీ కార్డులు, కార్డు ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. కాగా,నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్, హనుమకొండ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు నర్సింహారావు, మధుసూదన్, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, బాబులాల్, పవన్‌కుమార్, తదితరులను డీసీపీ అభినందించారు.

జెడ్పీమాజీ వైస్ చైర్మన్‌పై కేసు నమోదు

ఐనవోలు: హనుమకొండ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. నగరానికి చెందిన బుర్ర మాధవి మండలంలోని నందనం శివారులో అదే గ్రామానికి చెందిన సానం మల్లేశం వద్ద సుమారు నాలుగు ఎకరాల వ్యవయసాయ భూమి కొనుగోలు చేసి పట్టా పొందింది. కాగా, గజ్జెల్లి శ్రీరాములు ఈ భూమి మల్లేశం తనకు అంతకు ముందే అమ్మినట్లు కోర్టును ఆశ్రయించాడు. అయితే ఈ కేసుపై గత సంవత్సరం రాజీపడ్డాడు. ఇందుకు గాను తనకు మూడు గుంటల భూమి ఇవ్వాలని, లేదంటే మళ్లీ కోర్టులో కేసు వేస్తానని మాధవిని భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ ఘటనపై మాధవి గత నెలలో పోలీసులను ఆశ్రయించింది. దీంతో ఎస్సై శ్రీనివాస్.. శ్రీరాములుపై ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, ఈ ఘటనపై సోమవారం సాక్షులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.